www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 8 నవంబర్ 2024

పీఈఎస్ విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో గురువారం పీఈఎస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎంఆర్. దొరస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని కుప్పం పిఈఎస్ ఆసుపత్రి వారి సౌజన్యంతో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. దంత, చర్మ, కంటి, చిన్నపిల్లల విభాగాలకు సంబంధించి డాక్టర్ శ్రీధర్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ బృందం పిఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్.. అలంకారప్రాయం

పేరుకే ఆర్టీసీ బస్టాండ్.. అక్కడికి ఒక్క బస్సూ రాదూ, పోదు... మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు వెక్కిరిస్తున్నాయి.. పాలకుల వైఖరిని ప్రశ్నిస్తున్నాయి.. ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణకు ఆమడదూరంలో ఉంది. ఫలితంగా ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. బస్సుల కోసం గంటల తరబడి రోడ్ల పక్కనే పడిగాపులు పడాల్సి వస్తోంది. 1996లో బంగారుపాళెంలో పోలీస్‌స్టేషన్ పక్కన ఏపీఎస్ ఆర్టీసీ రూ.20లక్షలు వెచ్చించి అన్ని హంగులతో ఈ బస్టాండ్‌ను నిర్మించడం జరిగింది. ప్రయాణికుల సౌకర్యార్థం మంచినీటి కుళాయి, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు సైతం కల్పించారు. అయితే బస్టాండ్ నిర్మించినప్పటి నుంచి నేటి వరకు వినియోగంలోకి రాకపోవడం గమనార్హం.

- పిచ్చిమొక్కలతో ఆవరణం
- 28 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం
- రోడ్లపైనే పడిగాపులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- వినియోగం ఎన్నటికో అంటున్న ప్రయాణికులు

నిరుపయోగంగా ఉన్న బంగారుపాళ్యం ఆర్టీసీ బస్టాండ్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని డిపోల ఆర్టీసీ బస్సులు బంగారుపాళ్యం మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. చెన్నై- బెంగళూరు నగరాల్లో ప్రైవేటు కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు మండలం నుంచి పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. పలమనేరు, చిత్తూరు పట్టణాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు ప్రతి రోజూ ప్రయాణిస్తుంటారు. అయితే ప్రయాణికులు ఎండైనా, వానైనా రోడ్లపైనే బస్సుల కోసం వేచి చూడాల్సిందే.. ఇక వర్షం వచ్చినా అక్కడే వేచ్చి ఉండాలి..

వినియోగంలోకి తీసుకురావాలి..

లక్షలు ఖర్చు పెట్టి ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు దూరప్రాంతాలకు వెళ్లాలంటే రోడ్లపైనే పడిగాపులు పడుతున్నారు. బస్టాండ్ వాడుకలో లకపోవడంతో పచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారి కంపుకొడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండును ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు...

విద్యార్థులు, ప్రజలు బస్సుల కోసం ఎక్కడ వేచి ఉండాలో తెలీని పరిస్థితి. ఒక్కోసారి బస్సుల కోసం విద్యార్థులు రోడ్లపై ఉరుకులు, పరుగులు తీయడంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సమయానికి పాఠశాలలకు, కళాశాలకు వెళ్లాలనే కంగారులో బస్సులు రాగానే రోడ్డుపైకి విద్యార్థులు పరుగులు తీస్తున్నారు. కింద పడి ఎక్కడ ఎటువంటి ప్రమాదం జరుగుతోందనని వారి తల్లిదండ్రులు భయపడుతున్నారు. అదే బస్టాండ్‌లో బస్సులు ఆపితే విద్యార్థులు ప్రశాంతంగా బస్సు ఎక్కుతారని, ఇకనైనా బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రుల్లో అవస్థలు

రాత్రి ఎనిమిది దాటితే బంగారుపాళ్యం రావాలంటే ప్రయాణికులు అవస్థలు పడాల్సిందే. ఆర్డినరీ బస్సులు ఉండవు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు బంగారుపాళ్యంలోకి పోవు. బైపాస్ మీదుగా వెళ్లిపోతున్నాయి. దాంతో బంగారుపాళ్యం పరిసర గ్రామాలకు వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. రాత్రి సమయంలో చిత్తూరు, పలమనేరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ సర్వీసులు బంగారుపాళ్యం మీదుగా నడపాలంటూ పలుమార్లు ప్రజాప్రతినిధుల ద్వారా ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. మండల సర్వసభ సమావేశాల్లో సైతం ఆర్టీసీ బస్సు సర్వీసులను రాత్రి సమయాల్లో బంగారుపాళ్యం మీదుగా నడపాలని ప్రస్తావించినప్పటికీ ఆచరణకు రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

నిరీక్షణ తప్పడం లేదు..

- సుబ్రమణ్యం, బంగారుపాళ్యం, రైతు

బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో బస్సుల కోసం జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణాల ముందు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఎదురు చూస్తున్నాం. రాత్రి సమయంలో మరీ ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం రహదారి పక్కన కనీసం కూర్చునేందుకు అయినా తగిన ఏర్పాటు చేయలేదు.

చినుకుపడితే.. కునుకేదీ..!

భయం గుప్పెట్లో నీవా నది పరిసర పేదలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వాతావరణ శాఖ వర్షాల హెచ్చరికలతో చిత్తూరు నీవానది పరిసర పేదలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. రెండేళ్ళ కితం వచ్చిన హుదూద్ తుపాను చేసిన బీభత్సం అంతాఇంతా కాదు.. నేటికీ నాటి చేదు జ్ఞాపకాలు వీరి కళ్ళముందు కనిపిస్తున్నాయి. నాటి భారీ వర్షానికి నీవానది పరిసర ప్రాంతాల్లోనీ తేనబండ, రాజీవ్‌నగర్, కైలసపురం ప్రాంతాల్లోనే భవన నిర్మాణ కార్మికులు, ఆటో, రిక్షా కార్మికులు సర్వం కొల్పోయి పునవాస కేంద్రాల్లో దాదాపు 20 రోజులకు పైగా ఉండాల్సి వచ్చింది. ఒక్క రాజీవ్‌నగర్ కాలనీలోనే 80 పేద కుటుంబాలు సర్వం కొల్పోయారు. తేనబండ, కైలసపురంలో 60 కుటుంబాలు తమ ఇళ్లు వరద నీటిలో మునిగిపోవడంతో తట్టాబుట్టా సర్దుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమంటూ బతికారు.

తరచూ ఏర్పడుతున్న వాయుగుండాల ప్రభావంతో తుపాన్లు వస్తున్నాయంటే ఇక ఈ ప్రాంతాల్లోని పేదలకు కునుకుపట్టదు.. ఎప్పుడు నీవా నది పొంగి ఇళ్లలోకి వరద నీరు వచ్చేస్తుందో అని రాత్రాంతా జాగారం చేయాల్సిన పరిస్థితి. హుదూద్ తుపాను సృష్టించిన జలప్రలయంతో ఇంట్లోని వస్తువులు, బట్టలు, దాచుకున్న నగదు, నిత్యావసరాలను సైతం కోల్పోయారు. ఈ నష్టం నుంచి బయట పడటానికి వారి దాదాపు ఏడాది సమయం పట్టింది. ప్రస్తుతం ఇదే పరిస్థితి. వర్షాల సమయంలో పరదరామి, యాదమరి మండలాల్లోని చెరువుల నీరు నీవానదికి చేరుతాయి. దీంతో వరద పెరిగే అవకాశం ఉంది.

50 ఏళ్లు ఇదే పరిస్థితి..

నీవా నది పరిసరాల్లో పేదలు 50 ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. ఎప్పుడు లేని విధంగా హుదూద్ తుపాను వీరి జీవితాలను ఛిద్రం చేసింది. ఓట్ల సమయంలో ఇక్కడి ప్రజలు నీవానది లోతుపెంచి నది చుట్టు ప్రహరీ గోడ నిర్మించాలని కోరుతూనే ఉన్నారు. ఎన్నికల సమయంలో సమస్యకు పరిష్కార మార్గం చూపుదామంటూ హామీలు ఇచ్చే నేతలు తరువాత పట్టించుకోవడం మానేస్తున్నారు. దీంతో నీవానది సమస్య పరిష్కారం కాకుండా అలాగే సమస్యగా మిగిలిపోతుంది.

రూ.175 కోట్లతో ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదన

చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ ఎన్నికల ముందుకు ఈ ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడి పేదల సమస్యలను ఆలకించి నీవానది సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు వారం రోజుల కితం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయనే వాతావరణ హెచ్చరికల మేరకు నీవానదిలో జేసిబి ద్వారా పూడికలు తొలగించారు. కాజూరు నుండి కట్టమంచి వరకు ఏడు కిలోమీటర్ల పైగా ఉన్న నీవానదిలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు పూడికలు తీశారు. ఈ పనులు నీవా నది బాధితులకు ఊరటనిచ్చిందనే చెప్పాలి. అలాగే శాశ్వత పరిష్కార దిశగా నీవానదికి ఇరువైపుల ప్రహరీ గోడ నిర్మాణం కోసం జలవనరులశాఖ అధికారులతో సంప్రదించి రూ.175 కోట్లుతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నీవానదికి ఇరువైపుల రక్షణ గోడ నిర్మిస్తే దాదాపుగా 200 కుటుంబాలను వరద ముంపునుండీ కాపాడవచ్చు. ప్రభుత్వం త్వరగా నీవానది రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజురు చేసి నీవానది ముంపు కుటుంబాలకు రక్షణ కల్పించాలని నది పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

నీవానది పరిశుభ్రత పనులు పరిశీలిస్తున్న చిత్తూరు ఎంఎల్ఏ గురజాల, గతంలో హుదూద్ తుపాన్‌కు వరద నీటిలో మునిగిన కాలనీ

వెంటనే నిధులు మంజురు చేయాలి

- సురేంద్రన్, సిపిఎం నగర కార్యదర్శి

నీవానది పరిసరాల్లో భవన నిర్మాణ కార్మికులు, ఆటో రిక్షా కార్మికులు, రజకులు ఎక్కువగా జీవనం సాగిస్తున్నారు. వీరంతా రోజువారీ కార్మికులే. వర్షాల కాలంలో వీరి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటుంది. హుదూద్ తుపాను సందర్భంగా అనేక కుటుంబాలు సర్వం కోల్పోవాల్సి వచ్చింది. భారీ వర్షాల సమయంలో వచ్చే వరద నీరు ఇళ్లలోకి రాకుండా రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజురు చేసి పేదలను ఆదుకోవాలి.

50 ఏళ్లలో ఎన్నడూ చూడలేదు

- రంగమ్మ, రాజీవ్ నగర్ కాలనీ

రెండు సంవత్సరాల కితం వచ్చిన హుదూద్ తుపాను గత 50 సంవత్సరాల్లో ఎప్పుడూ చూడలేదు. ఉన్నట్లుండి రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లోని వర్షపు నీరు వచ్చింది. దీంతో చేతికి దొరికింది పట్టుకొని మిట్టప్రాంతానికి పరుగుపెట్టాం. తెల్లరుజామున ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో దాదాపు 20 రోజుల పాటు ఉండి వరద నీరు తగ్గిన తరువాత ఇల్లు చూస్తే మొత్తం బురదతో నిండిపోయింది ఇంట్లోని సామాన్లు కొన్ని కొట్టుకుపోగా, మరికొన్ని పనికిరాకుండా పోయాయి. శుభ్రం చేయడానికికే వారం రోజులు పట్టింది.

పేదలపై కనికరం చూపాలి

- నీలమ్మ, వీరభద్రకాలనీ

నీవానది పరిసరాల్లో దినసరి కూలీలమే ఎక్కువగా ఉంటున్నాం. నేను ఇంటి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఓట్లు అడిగేందుకు వచ్చిన సందర్భాల్లో మా కష్టం అనేకసార్లు చెప్పాం. ఏండ్లు గడస్తున్నా పట్టించుకోవడం లేదు. 40 ఏండ్లుగా ఇదే ప్రాతంలో నివాసముంటున్నాం. నిత్యం కంపుకొట్టే మురుగునీటి వాసన, దోమలతో గడపాల్సిందే. నీవానది శుభ్రం చేసి మురుగునీరు పారేలా చేస్తే దోమలు తగ్గుతాయి. నీవానది పరివాహన ప్రాంతం చుట్టూ గోడ నిర్మిస్తే మాకు రక్షణగా ఉంటుంది.

ఎమ్మెల్యే చొరవతో

గుడియాత్తం రోడ్డుకు మహర్దశ

- త్వరలో మరమ్మతు పనులు
- సమస్యపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశకి- యాదమరి: యాదమరి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి యాదమరి – గుడియాత్తం రోడ్డు మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ని కోరారు. గురువారం చిత్తూరు జిల్లా సచివాలయంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, ఆర్అండ్‌బి అధికారులతో ఎమ్మెల్యే రోడ్డు పనులపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా మరమ్మతు పనులకు నోచుకోకుండా ప్రయాణికులకు ప్రాణాలను బలికొంటున్న యాదమరి – గుడియాత్తం రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే యాదమరి రహదారి మరమ్మతు పనులు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా యాదమరి ప్రజలకు ఇచ్చిన మాటకు ప్రకారం తాను ప్రమాణ స్వీకారం చేసిన వేంటనే ఆర్అండ్‌బి మంత్రిని కలిసి యాదమరి – గుడియాత్తం రోడ్డు మరమ్మతు పనులకు ప్రతిపాదన తీసుకెళ్ళడం జరిగిందన్నారు. యాదమరి రహదారిపై వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులను సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, సీఎం ఆదేశాల మేరకు అధికారుల సమన్వయంతో యాదమరి – గుడియాత్తం రోడ్డు పనులకు నిధులు కేటాయించి, త్వరలోనే మరమ్మతు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



రోడ్డు పనులపై కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

అర్హులందరికీ ఉచిత గ్యాస్ : జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి దీపం పథకం 2 ఉచిత గ్యాస్ పథకానికి అర్హులని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దీపం–2 ద్వారా సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ నుంచి మార్చి వరకు ఒక సిలిండర్, ఏప్రిల్ నుంచి జూలై వరకు ఒక సిలిండర్, ఆగస్టు నుంచి నవంబర్ వరకు ఒక సిలిండర్ చొప్పున ఉచిత రీఫిల్లింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఉచిత గ్యాస్ ద్వారా మనం కట్టిన డబ్బులు తిరిగి మన ఖాతాల్లోకి 48 గంటల్లోపు పడే అవకాశం ఉందన్నారు. చిన్నచిన్న టెక్నికల్ ప్రాబ్లమ్స్ ఉంటే గ్యాస్ డీలర్ కంపెనీలు సరిచేస్తాయని తెలిపారు. ఈ కెవైసి కాని వారికి గ్యాస్ డెలివరీ బాయ్స్ ఇంటి దగ్గరే ఈ కెవైసి చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్ పొందే సమయంలో నగదును పూర్తిగా చెల్లించవసలసి ఉంటుందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విషయంలో ఏవైనా సమస్య ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేయవచ్చు లేదా సచివాలయంలో లేదా ప్రజాసమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని తెలిపారు .జిల్లాలో దీపం –2 పథకం ద్వారా 1,11,165 సిలిండర్లు బుక్ కాగా 64,759 సిలిండర్లు పంపిణీ చేశామని, 10,994 మందికి పూర్తి సబ్సిడీ జమ చేయనున్నట్లు తెలిపారు.

విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- యాదమరి

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ప్రతి విద్యార్థి చదువుకుని జీవితంలో మంచి ప్రయోజకులు కావాలని సూచించారు. గురువారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కాసిరాళ్ల ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనాలను కలెక్టర్, ఇండియన్ ఆల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ సుజిత్ కుమార్ పట్నాయక్ ప్రారంభించారు. కలెక్టర్‌కు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కాసిరాళ్ల ఉన్నత పాఠశాలలో రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన భోజనశాల, వంట గది, బాలికల మరుగుదొడ్లు, షటిల్ కోర్టు, వాలీబాల్ కోర్టులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందిస్తుందని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. పాఠశాలను ఆహ్లాదకరంగా ఆదర్శంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు సహకారంతో నూతన భవనాలు నిర్మించడం హర్షించదగ్గ విషయమన్నారు. సుజిత్ కుమార్ పట్నాయక్ మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పనకు ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని, అందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిజిఎం కైలాస్ కౌశిక్, అమిత్ సర్దార్, ప్రిన్సిపాల్ ఎపి.లలిత, డీవైఈవో చంద్రశేఖర్, మండల విద్యాశాఖ అధికారి రుక్మణమ్మ, ప్రసాద్, తహశీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, పాఠశాల ఛైర్మన్ నవీన్, ఉపాధ్యాయులు కనకాచారి, మదన్మోహన్ రెడ్డి మధుసూదన్, భాస్కర్ రెడ్డి పద్మనాభరెడ్డి, సుల్తాన్, వాణి, భారతి, చిన్న దొరై పాల్గొన్నారు.

నూతన భవనాలను పారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఇండియన్ ఆల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, ప్రధానోపాధ్యాయులు

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

- 3 మండలాలకు తీరిన కరెంట్ కష్టాలు
- వర్చువల్‌గా సబ్ స్టేషన్ ప్రారంభించిన సిఎం

ప్రజాశక్తి - వీకోట : రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ వారిచే చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం తోటకనుమ వద్ద రూ.38 కోట్లతో 132/33 కె.వి విద్యుత్ ఉపకేంద్రాన్ని, సంబంధిత అనుసంధాన లైను పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం అమరావతి తాళయపాలెం 400/220 కెవి ఉపకేంద్రం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. వీ కోట నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పలమనేరు ఎంఎల్ఏ ఎన్.అమరనాథరెడ్డి, తదితరులు వీక్షించారు. అనంతరం వి.కోటలో ఉప కేంద్రం శిలా ఫలకాన్ని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ ఉపకేంద్రం ఏర్పాటు ద్వారా పలమనేరు నియోజకవర్గం వి.కోట, బైరెడ్డిపల్లి, కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలాల పరిధిలో వ్యవసాయ, గృహాలకు మెరుగైన విద్యుత్ అందించుటకు వి.కోట తోట కనుమ గ్రామంలో అధికస్థాయి ఓల్టేజీ సామర్థ్యంతో 132/33 కె.వి. విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం ఉపయోగపడుతుంది. దీని ద్వారా సుమారు 46 వేల మందికి లబ్ధిచేకూరనుంది.

132 కె.వి లైను (1.706 కి.మీ)

ప్రస్తుతం ఉన్న 132 కెవి. పలమనేరు–శాంతిపురం లైనును 132/33 కెవి వి.కోటకు లిలో పద్ధతిలో కలుపనున్నారు. ఈ ఉప కేంద్రం ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో గృహ, వ్యవసాయంకు మెరుగైన నాణ్యమైన విద్యుత్ అందించటంతోపాటు ఓల్టేజి హెచ్చు తగ్గుల సమస్యలు, విద్యుత్ ప్రసార నష్టాలను అరికట్టేందుకు ఉపయోగపడుతుంది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం పట్ల మండల ప్రజలు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గతంలో మంజూరు.. నేడు ప్రారంభం: ఎమ్మెల్యే

సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గత తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2018లో మంజూరు చేసిన 132,/33 కెవి సబ్‌స్టేషన్ మరలా ఇదే ప్రభుత్వంలో ప్రారంభించడం గర్వకారణంగా ఉందని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తోట కనుమ సమీపంలో గురువారం 132/33 కెవి సబ్‌స్టేషన్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన పలమనేరు నియోజకవర్గంలో రైతులు, ప్రజలు పడుతున్న లో వోల్టేజ్ సమస్యను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పలమనేరు నియోజకవర్గానికి రెండు సబ్ స్టేషన్ లను మంజూరు చేశారని గుర్తుచేశారు. ఒకటి వీకోట మండలం మరొకటి గంగ్రాజుపల్లి సబ్ స్టేషన్లు ప్రారంభానికి గతంలోనే పరిపాలనా అనుమతులు మంజూరు చేసామన్నారు. అనంతరం ఏర్పడిన వైసిపి ప్రభుత్వం పనులను చేపట్టడంలో అలసత్వం ప్రదర్శించిందని మరలా నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో తోటకనుమ సమీపంలో సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా వర్చువల్ గా ప్రారంభించడం గర్వకారణంగా ఉందన్నారు. దీని ద్వారా వీకోట, బైరెడ్డిపల్లి మండలాలతో పాటు శాంతిపురం మండలంలోని రైతులు, ప్రజలకు లో వోల్టేజ్ సమస్య తీరి నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలైందన్నారు. అదేవిధంగా రెండు నియోజకవర్గాల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ ద్వారా సుమారు రెండు నియోజకవర్గాల్లో 46వేల మంది లబ్ధి పొందనున్నారన్నారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా లో వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్యలు, విద్యుత్ ప్రసార నష్టాల పరిష్కారం జరుగుతుందన్నారు. ఎస్ఈ ఆపరేషన్ ఇస్మాయిల్, పలమనేరు ఆర్‌డీఓ భవాని, ఈఈ శ్రీనివాస్ మూర్తి, ఏపీ ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్, చిన్నప్ప, గణేష్ రెడ్డి, తహశీల్దార్ పార్వతి, టిడిపి నేతలు రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్ గౌడ్, వేణుగోపాల్, రూహుల్లా పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన నారా బ్రాహ్మణి

ప్రజాశక్తి- శాంతిపురం : శాంతిపురం మండలం శివపురం సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణాన్ని పరిశీలించేందుకు వచ్చిన నారా బ్రాహ్మణిను కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సీఎం వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, టిడిపి సలహాదారులు నరేష్ ఆచారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని నిర్మాణం చేపడుతున్న ఎల్ఎన్‌టి ప్రతినిధులను ఆమె కోరారు.

కేన్సర్ పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం

వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు

ప్రజాశక్తి- సోమల: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కేన్సర్ పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం అవుతుందని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ కుమార్, పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారి బాలాజీ, కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని విజయలక్ష్మి అన్నారు. మూడు ఆరోగ్య కేంద్ర పరిధిలోని వైద్య సిబ్బందితో కేన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి సోకిన వారికి మలమూత్ర విసర్జనలో మార్పు, విరేచనాలు, పొత్తికడుపులో నొప్పి, చర్మంలో మార్పులు, రొమ్ములో గడ్డలు, జీర్ణ సమస్యలు, నిరంతరం దగ్గు, బరువు తగ్గడం, నోటి దుర్వాసన లాంటి లక్షణాలు కనిపిస్తాయని అనుమానం ఉన్నవారు వైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స పొందవచ్చునని తెలిపారు ఇరికిపెంట సబ్‌సెంటర్లో గర్భవతులకు గ్రామస్తులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపాల: స్క్రీనింగ్ పరీక్ష ద్వారా కేన్సర్‌ను జయించవచ్చు అని డాక్టర్ సంధ్య తెలిపారు. గురువారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ కేన్సర్ అవేర్నెస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పరిధిలో కూడా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సిబ్బంది కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు పరీక్షలు చేసుకోవడం ద్వారా క్యేనర్ రాకుండా రక్షణ పొందవచ్చుఅని తెలిపారు. డాక్టర్ చంద్రమహేష్, సిబ్బంది అనూష, వెంకటేష్, చంద్రశేఖర్, సరస్వతి, ఉమా పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: కేన్సర్ లక్షణాలుంటే వెంటనే స్క్రీనింగ్ పరీక్ష చేయడం ద్వారా కేన్సర్‌ను విజయవంతంగా జయించవచ్చు అని డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు. గురువారం కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఈ కాంతమ్మ, శ్రీదేవి, పూర్ణా, ఆయుబ్, ఆషా, సిబ్బంది పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న మాస్క్ దొంగలు..

- మహిళల మెడలోని గొలుసులే లక్ష్యంగా
- పది రోజుల్లో నాలుగు చోరీలు

పూతలపట్టు మండల పరిధిలోని మహిళలు ఒంటరిగా అడుగుపెట్టడానికి భయపడుతున్నారు. మగవారి తోడు లేకుండా పంట పొలాల్లోకి వెళ్లడానికి జంకుతున్నారు. కొందరైతే మెడల్లో బంగారు గొలుసులు మాకొద్దు బాబోయ్ అంటున్నారు. గ్రామాల్లో సైతం కొత్తవారిని చూస్తే అనుమాన పడాల్సిన పరిస్థితి నెలకొంది. గత పది రోజులుగా మాస్క్ దొంగలు దడ పుట్టిస్తున్న ఉదంతాలే ఇందుకు కారణం.

ప్రజాశక్తి- పూతలపట్టు: మండల పరిధిలో గత పది రోజులుగా ఇద్దరు మాస్క్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వరుసబెట్టి మహిళ మెడలోని గొలుసులను తెంపుకెళుతూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. రహదారి పక్కన ఉన్న గ్రామాలు, పంట పొలాల్లోని ఒంటరిగా ఉన్న మహిళలనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వచ్చి వాహనాన్ని రోడ్డుపై పెట్టి ఎలాంటి అనుమానం రాకుండా దాడి చేస్తున్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న మహిళలపై కూడా దాడులకు పాల్పడుతున్నారు. ఒక్కో రోజు ఒక్కో ద్విచక్ర వాహనంపై దుండగులు వస్తున్నట్టు సమాచారం. వీరు వస్తున్న వాహనాలకు ఎలాంటి నెంబర్ ప్లేట్లు లేవన్న విషయాన్ని సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించారు. రోజుకు ఒక్కో మార్గాన్ని ఎంచుకొని చోరీలకు పాల్పడుతున్నారు. వీరు నల్లని మాస్కులు ధరించి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

వరుస చోరీలతో బెంబేలు

గడిచిన 10 రోజుల్లోనే వరుసగా నాలుగు చోరీలు జరిగాయి. గత నెల 26న గ్రామానికి చెందిన మల్లిక జాతీయ రహదారిపై పశువులను తోలుకొని వస్తుండగా దుండగులు ఆమెపై దాడి చేసి 56 గొలుసును చోరీ చేశారు. అనంతరం గొల్లపల్లెకు చెందిన నాగరత్నమ్మ మెడలోని 36 గ్రాముల గొలుసును చోరీ చేశారు. అదేవిధంగా ఐరాల మండలం పులికల్లుకు చెందిన ప్రమీల తన కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. ఆమె మెడలోని గొలుసును లాక్కోవడానికి ప్రయత్నించారు. దీంతో ఆమె ప్రతిఘటించడానికి ప్రయత్నించగా అదుపుతప్పి రోడ్డుపై పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి వాత పడింది. గత ఆదివారం తిమ్మిరెడ్డిపల్లి జగనన్న కాలనీలో ఒంటరిగా ఇంట్లో వంట చేసుకుంటున్న భారతిపై దాడి చేసి 25 గ్రాముల గొలుసును లాక్కెళ్లారు.

దుండగులను అడ్డుకుని ప్రమాదానికి గురై మృతి చెందిన ప్రమీల

పోలీసులకు సవాలే...

ఒక్కో రోజు ఒక్క మార్గాన్ని ఎంచుకుంటూ పలు రకాల వాహనాల్లో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్న దుండగులను పట్టుకోవడం పోలీసులకు సవాళ్లే అని చెప్పవచ్చు. దుండగులను పట్టుకోవడానికి తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే అనుమానంగా తిరుగుతున్న వారిపై నిఘా పెట్టినట్టు సమాచారం.

గూ(కూ)డూ లేదు..

- దీనావస్థలో వృద్ధురాలు
- చూసేవారు లేక ఇబ్బందులు
- ఆదుకోవాలంటున్న స్థానికులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం

90 ఏళ్ల వృద్ధాప్యంలో చూసే వారు లేక, తినడానికి తిండి ఉండటానికి గూడు లేక ఓ వృద్ధులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం.. ఈ ఫొటోలో కనిస్తున్న అవ్వపేరు పి.నాగమ్మ (90) ఈమె మండలంలోని తిరుమలయ్యపల్లి వద్ద గల కొమ్ము ఇండ్లు, ఆది అరుంధతి వాడకు చెందింది. ఆమెకు పిల్లలు లేరు. భర్త చాలా సంవత్సరాల క్రితమే మరణించాడు.. కూలీనాలి చేసుకుంటూ జీవించింది. శరీరంలో పట్టుతప్పి కష్టపడే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం నడిచే పరిస్థితిలో కూడా లేదు.. అయినవారు ఉన్నా ఆదరించే పరిస్థితి లేదు.. దీంతో గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఓ భవనం ఆవరణంలో ఉంటోంది. చుట్టుపక్కల వారు దయతలచి తినడానికి ఏమైనా పెట్టినా ఆమె తినలేని పరిస్థితి. కదలేక అక్కడే మలమూత్ర విసర్జన చేయడంతో దుర్వాసనకు ఎవరూ ఆమె దగ్గరకు కూడా రావడంలేదు.. ఈమెకు ఎన్‌టిఆర్ భరోసా పింఛను నెలకు రూ.4వేలు అందుతోంది. ఎవరైనా వృద్ధురాలి ధీనస్థితి చూసి దాతలు కానీ, వృద్ధాశ్రమం వారు కానీ ఆమె బాగోగులు చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య లోపం

రోగాల భారిన పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని మాధవరం పంచాయతీ ఏం బోయపల్లి గ్రామంలో పారిశుధ్య లోపం కారణంగా ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. వీధుల్లో చెత్తాచెదారం, కాలువల్లో మురుగునీరు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమలు, పురుగులతో ప్రరజలు అవస్థలు పడుతున్నారు. వర్షాల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు సీజనల్ వ్యాధులతోపాటు, దోమల వలన డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి విషజర్వాల భారిన పడి ఆసుపత్రిపాలైతున్నారు. ప్రధానంగా ఎంపీపీ స్కూల్ పక్కన చెత్త కుప్పలు వేయడంతో విపరీతంగా దోమలు వృద్ధి చెంది స్కూల్ పిల్లలు తరచూ రోగాల భారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు చొరవ చూపి గ్రామాల్లోని చెత్తను శుభ్రం చేయిండంతోపాటు, కాలువల్లో మురుగు సాఫీగా వెళ్లేలా పూడికలు తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ భద్రతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబర్ భద్రత కోఆర్డినేటర్ వై.శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోకూడదని, బ్యాంక్ లావాదేవీల సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కె.మున్వర్, డాక్టర్ ఎల్ఎండి.భక్షు, డాక్టర్ కె.శంకర్ రెడ్డి, డాక్టర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ల్యాబ్ పరికరాలు వితరణ

ప్రజాశక్తి- సదుం: సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు రూ.85,000లు విలువైన ల్యాబ్ పరికరాలను వితరణగా అందజేశారు. గురువారం పాఠశాల విద్యార్థులకు అవసరమైన ల్యాబ్ యాక్యుప్మెంట్స్, కెమికల్స్, మోడల్స్, చార్ట్స్, మైక్రోస్కోప్ తదితర మెటీరియల్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జయకుమార్ రెడ్డికి అందించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి సహకారం అందించిన దాతలు బాబురెడ్డి, దామోదర్ రెడ్డి, రుక్మాంగధ రెడ్డి, రాజారెడ్డి, గుణభూషణ్ రెడ్డి, దూర్వాశాల రెడ్డి, డాక్టర్ కే.కరీముల్లా, సరస్వతి, శివరామిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు సంత వేలంపాట

ప్రజాశక్తి- వెదురుకుప్పం: పచ్చికాపల్లం గ్రామపంచాయతీలోని సంత వేలంపాట 8వ తేదీ శుక్రవారం జరుగుతుందని అధికారులు గురువారం దండోరా వేయించారు. పచ్చికాపల్లం వారపు సంత ప్రతి ఆదివారం జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులు పండించిన పంటను, వ్యాపారస్తులు ఇక్కడి అమ్ముకుంటారు. ఇందుకోసం ఎవరైనా వేలం పాట పాడదలుచుకున్నవారు రూ.6250లు చెల్లించి పాటలో పాల్గొని పాడుకోవచ్చని దండోరా వేశారు.

ప్రతి ఒక్కరికీ విద్య అవసరం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రతి ఒక్కరికి విద్య అవసరమని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. గురువారం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు వయోజన విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటిలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మార్చాడానికి ఉల్లాస్ అనే కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని నిర్యక్షరాస్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి ఎం. విజయకుమార్ మాట్లాడుతూ సంఘమిత్రలు బాధ్యతగా తీసుకుని నిర్యక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలను సూచించారు. ఏపీఎం కవిత, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సోమల: చదువురాని నిరక్షరాస్యులైన వయోజనులకు విద్య నేర్పించేందుకు ఎంపిక చేయబడిన వాలంటీర్లు ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సైనికుల పనిచేయాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. గురువారం వెలుగు సమావేశ మందిరంలో మండలంలో ఎంపిక చేసిన 34 మంది వాలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలలో నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలను గుర్తించి వారికి 2025 మార్చి 31వ తేదీ లోపు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు డిజిటల్ లావాదేవీలను పెంపొందించినందుకు కూడా వారిని సంసిద్ధులను చేసే పనిని వాలంటీర్లు బాధ్యతగా తీసుకొని నిర్వర్తించాలని కోరారు. ఏపీఎం శివ మాట్లాడుతూ మండలంలో మహిళా సంఘాలలోని 340 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. సోమల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య, సిసిలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : గురువారం ఉల్లాస్ ఒకరోజు శిక్షణ కార్యక్రమం వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో మోహన మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాలలో నిరక్షరాస్యులకు సులభ పద్ధతిలో చదువు నేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రోజా వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సదుం: వయోజన విద్య 'ఉల్లాస్' కార్యక్రమంలో భాగంగా గ్రామాలలోని ఎంపిక చేసిన నిరీక్షరాస్యులకు విద్య అందించాలని సదుం ఇన్చార్జి ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏపీఎం హరిప్రసాద్ వాలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు మధుసూదన్ రెడ్డి, భాను కుమార్, మల్లీశ్వరి, సుజాత వాలంటీర్లు పాల్గొన్నారు.

యాదమరి: మండల అభివృద్ధి అధికారి వేణు ఆధ్వర్యంలో గురువారం ఉల్లాస్ కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వయోజన విద్యాశాఖ సూపర్ వైజర్ కందేశ్వర రావు మాట్లాడుతూ గ్రామంలోని నిరక్ష్యరాస్యులకు చదవడం, రాయడం, సంఖ్యాపరిజ్ఞానం నేర్పించడంతోపాటు అదనంగా ఆర్థిక, న్యాయ, డిజిటల్ అక్షరాస్యత ఆవశ్యకతలను తెలియజేయాలన్నారు. ఏపిఎం ఈశ్వరి, సీసీలు మల్లీశ్వరి, మంజుల, లక్ష్మీపతి, వెంకటేశులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తలకు స్పందనలు

నీటితొట్టె శుభ్రం

చెత్తాచెదారం తొలగింపు

నీటి తొట్టెలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- సోమల: అక్టోబర్ నెల 29వ తేదీ ప్రజాశక్తిలో ప్రచురించిన నీటి తొట్టెలో చెత్తాచెదారం మద్యం బాటిల్లు వార్తకు స్పందించిన పంచాయతీ సిబ్బంది నీటి తొట్టిలో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరిచారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మజహర్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టెలో చెత్తాచెదారం మద్యం బాటిల్లు వేసి అపరిశుభ్రంగా ఉంచారన్న వార్తకు స్పందించి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో నీటి తొట్టెను శుభ్రపరిచామని, ఇకపై అందులో ఎలాంటి వ్యర్థాలు వేయకుండా చూస్తామని తెలిపారు.

పలమనేరు నుంచి బెంగళూరుకు

వారాంతంలో ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నుండి బెంగుళూరుకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్సులు లేక పడుతున్న అవస్థలను గురించి ఈ నెల 4వ తేదీ ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన వార్తకు డిపో మేనేజర్ స్వామి స్పందించారు. ఈ మేరకు వారాంతంలో పలమనేరు నుంచి బెంగళూరుకు, బెంగళూరు నుంచి పలమనేరుకు ప్రయాణికుల సౌకర్యార్థం చిత్తూరు డిపిటిఓ ఆదేశాలతో ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించారు. శుక్ర, శని, ఆది, సోమ వారాల్లో ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు ఉంటాయని తెలిపారు. ప్రయాణించేవారు అడ్వాన్సుగా రిజర్వేషన్ చేసుకొని ప్రయాణించాలని డిపో మేనేజర్ స్వామి తెలిపారు.

గుంతలరోడ్డుకు మరమ్మతులు

సదుం: సదుంలోని రోడ్డు గుంతల పడి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా ఉందంటూ 'అస్తవ్యస్తంగా సదుం కాలేజ్ రోడ్డు' అనే శీర్షికతో ఈనెల 2వ తేదీ ప్రజాశక్తిలో ప్రచురించిన వార్తకు స్పందన లభించింది. గురువారం సదుం గ్రామపంచాయతీ ఈవో హసీనా రోడ్డులో ఏర్పడిన గుంతలకు తాత్కాలికంగా మట్టిని నింపి, జెసిబితో చదును చేయించారు. అలాగే హైస్కూల్ మిట్ట వద్ద నివాస ప్రాంతాలకు దగ్గర్లోని డంపింగ్ యార్డ్‌ను శుభ్రం చేయించి, పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డు ఇరువైపులా శుభ్రం చేయించారు. అలాగే ఆటో యూనియన్ సభ్యులు సొంతఖర్చుతో కొంత మట్టిని వేసి గుంతలు పూడ్చారు. ఈవో హసీనా మాట్లాడుతూ సదుం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పరిశుభ్రత విషయంపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పిఎం విశ్వకర్మ యోజనా పథకం కింద అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిఎం విశ్వకర్మ యోజన కింద బ్యాంక్ రుణాలు మంజూరుకు సంబంధించి డిఆర్‌డిఏ, మెప్మాపి డిలు, ఎల్‌డిఎం, నైపుణ్యాభివృద్ధి అధికారి, బ్యాంకుల మేనేజర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజనను ప్రారంభించిందని, కేవలం 5 శాతం వడ్డీకే రూ.3లక్షల వరకు లోన్ అందించడం జరుగుతుందని, సంప్రదాయ పనిముట్లను, చేతి వృత్తులను ఉపయోగించి పనిచేసే కళాకారుల కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. చేతి పనుల వారు, కళాకారులు చేసే ఉత్పత్తుల నాణ్యతను పెంచడం, వారిని దేశీయ, గ్లోబల్ మార్కెట్‌తో అనుసంధానించడం ఈ స్కీమ్ వెనుకున్న మరో ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హులైన వారికి రుణాలు మంజూరుకు బ్యాంకర్లు చొరవ చూపాలని, ప్రతి బ్యాంకుకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. డిఆర్‌డిఏ, మెప్మా పిడిలు రవి కుమార్ నాయుడు, రాధమ్మ, ఎల్‌డిఎం హరీష్, నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి, జిఎండిఐసి చంద్రశేఖర్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'విద్యుత్ అదాలత్'

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గ్రామాల్లోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నలు (విశ్రాంతి జడ్జి) ఛైర్మన్ శ్రీనివాస ఆంజనేయులు మూర్తి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ అదాలత్ కార్యక్రమం ఏఈ హేమచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మూర్తి మాట్లాడుతూ మండలంలోని ఆరు సమస్యలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇండ్లపై విద్యుత్ వైర్లు తొలగింపు, కల్లూరు పంచాయతీలో భూమి గొడవ వలన విద్యుత్ స్తంభం నాటకూడదని, తగ్గువారిపల్లి పంచాయతీలో రెండు ట్రాన్స్ఫార్మర్లు మార్చాలని ప్రజలు వినతులు అందించారని ఈ సమస్యలపై త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్థిక సభ్యులు రామ మోహన్ రావు, సాంకేతిక సభ్యులు అంజనీ కుమార్, డీఈ సురేష్, ఏడీ అరుణ్ కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస ఆంజనేయులు మూర్తి

ఉపాధి పనులు వేగవంతం చేయండి

అధికారులతో సమీక్ష సమావేశంలో చల్లా సూచన

ప్రజాశక్తి- పుంగనూరు: ఉపాధి హామీ పనుల్లో పుంగనూరు మండలం వెనుకంజలో ఉందని, పనులు వేగవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహ ఆవరణంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులు చేపట్టడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా లేక రైతులు ముందుకు రావడం లేదా అంటూ ప్రశ్నించారు. ఉపాధి పనులు ఎక్కువ చేసి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. చదల్ల పంచాయతీలో ఉపాధి పనుల్లో వెనుకబడ్డామని రైతులు సహకరించకపోతే ఇతర రైతులకు అవకాశం ఇవ్వాలన్నారు. మంజూరైన నిధులన్నీ ఖర్చు చేయాలని నిధులు వెనక్కి పంపడం కుదరదని, కావున ఎన్ని ఎక్కువ పనులు వీలైతే అన్ని చేయించాన్నారు. ఫిష్ పాండ్లు, గోకులం షెడ్లు అధికంగా చేయించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, తహశీల్దార్ రాము, ఎంపీడీవో లీలామాధురి, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, సివిరెడ్డి, పోలీస్ గిరి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి: ఎంపిడిఓ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని గ్రామాల్లో ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఓ హరిప్రసాద్ రెడ్డి కోరారు. సంపూర్ణ పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా గంగాధర నెల్లూరు దళితవాడలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన స్కిల్ కన్సెస్ సర్వే ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపిడిఓ మాట్లాడుతూ పారిశుధ్యం లోపించకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి గ్రామంలోనూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 15 నుంచి 59 సంవత్సరాల మధ్య గల వ్యక్తుల విద్యార్హతలు, ఉద్యోగ అనుభవాలను సేకరించేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: రంగారెడ్డి చెరువులోపడి ఓ వ్యక్తి మరణించిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గొడుగుచింత పంచాయతీ దిగువపల్లాల గ్రామానికి చెందిన యానాది సుబ్బరామయ్య (62) ఓ మామిడి తోపులో కాపలాగా ఉంటున్నాడు. సమీప చెరువులో చేపల వేటకు వెళ్లిన సుబ్బరామయ్య ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చు అని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అనారోగ్యంతో వీఆర్ఏ మృతి చెందిన సంఘటన మండలంలోని మొగిలి వెంకటగిరిలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాల మేరకు.. పాలేరు రెవెన్యూ వీఆర్ఏగా తలారి వరదయ్య గత 45 సంవత్సరాలుకు పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యభారిన పడి పలు ఆసుపత్రిలో చికిత్సలు పొందినా నయంకాకపోవడంతో గురువారం మృతి చెందారు. వరదయ్య పార్థివదేహానికి తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలుచ వీఆర్ఏలు సందర్శించి నివాళు లర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలతో ఆసుపత్రి పాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గంగాధర నెల్లూరు పంచాయతీ కట్టకిందపల్లె దళితవాడకు చెందిన చిన్నా(40) ద్విచక్ర వాహనంపై గంగాధర నెల్లూరు కూడలి వద్ద ఉండగా వెనకనుంచి వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొన్నింది. ఈ ప్రమాదంలో చిన్నా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి -గుడిపాల: మండలంలోని రాసనపల్లి అటవీ ప్రాంతంలో సుమారు 400 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నటుల గుడిపాల ఎస్సై రామ్మోహన్ తెలిపారు. గురువారం రాసనపల్లి అటవీ ప్రాంతంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారాను స్వాధీనం చేసుకన్నట్లు తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని తమకు తెలియజేయాలని మండల ప్రజలను కోరారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి- విజయపురం: అనారోగ్యంతో పోలీసు కానిస్టేబుల్ తంగరాజ్ (38) గురువారం తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ బలరాం తెలిపారు. నగరి మండలం దేశూరు అగరం ప్రాంతానికి చెందిన తంగరాజ్ రెండు సంవత్సరాల పాటు విజయపురంలో పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన మృతి పట్ల పులువురు పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

ముగ్గురికి రూ.5వేలు జరిమానా

ప్రజాశక్తి- కుప్పం టౌన్: మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి రూ.5000లు జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష, ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తున్నట్టు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. గుడుపల్లి మండల పరిధిలోని చప్పిడి గరుగుల ప్రాంతంలో ఎస్సై శ్రీనివాసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని కుప్పం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా వారికి జరిమానాతోపాటు జైలు శిక్షణను విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు.

రైతుపై దౌర్జన్యం- హత్యాయత్నం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భూమిని విక్రయిస్తామని చెప్పి లక్షల రూపాయలు తీసుకొని రైతును మోసం చేయడమే కాకుండా దాడికి పాల్పడి పెట్రోల్ పోసి హత్యాయత్నంకు పాల్పడిన ఘటన పెనుమూరు మండలం సాతం బాకం పంచాయతీ పెద్దిరాజుపల్లిలో చోటు చేసుకుంది. తనకు జరిగిన అన్యాయంపై రైతు రాజారెడ్డి మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ దగ్గర రెండు ఎకరాల భూమిని లీజుకు, సెల్ అగ్రిమెంట్ రూపంలో రూ.16,20,000లకు ఒప్పందం కుదుర్చుకుని రూ.9,20,000లు చెల్లించారని, రిజిస్ట్రేషన్ అయిన తర్వాత మిగిలిన డబ్బులను చెల్లిస్తామని చెప్పారని తెలిపారు. అయితే డబ్బులు తీసుకున్న ప్రవీణ్ కుమార్ రెడ్డి దౌర్జన్యం చేస్తూ తమ భూమిలో అడుగు పెట్టరాదని దాడికి తెగబడ్డాడని, తమపై పెట్రోలు పోసి హత్యచేసేందుకు ప్రయత్నించాడని తెలిపారు. పోలీసు అధికారులకు తమకు న్యాయం చేయాలని రైతు దంపతులు కోరారు.

గృహ నిర్మాణాలపై వింత ధోరణి

తాజా నిర్మాణాలకు మాత్రమే రూ.4 లక్షలు

గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లపై పక్షపాతం

ప్రజాశక్తి- విజయపురం (నగరి)
పేదల సొంతింటి కలను ప్రభుత్వం పీడకలగా మారుస్తోంది. పేదల ఇళ్ల నిర్మాణంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలపై వివక్ష చూపుతోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ సమానమే అన్న నియమాన్ని ఉల్లంఘిస్తోంది. కొత్తగా మంజూరయ్యే గృహనిర్మాణాలకు మాత్రమే రూ.4లక్షలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. ఈ పరిణామం సొంత ఇళ్ళు నిర్మించుకుంటున్న పేదల్లో ఆందోళన కలిగిస్తోంది. గత ప్రభుత్వంలో మంజూరై, ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణ పనులు సాగుతున్న ఇళ్ల పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ఏదైనా ప్రజలపట్ల పక్షపాత ధోరణి అవలంభించడం ఎంతవరకు సమంజసం. తమకు సైతం రూ.4 లక్షల నిబంధన వర్తింప చేయాలని మిగిలిన ప్రజలు కోరుతున్నారు.

నగరి నియోజకవర్గంలో 5195 ఇళ్లు మంజూరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత అర్హులైన నిరుపేదలకు ఒక సెంటు ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 5195 ఇళ్లు కేటాయించగా అందులో 4942 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వీటిలో 2001 గృహనిర్మాణాలు పూర్తి చేసుకుని జిల్లాలో మూడవస్థానంలో నిలిచింది నియోజకవర్గం. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. పార్టీలకు అతీతంగా ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాలకే కాకుండా అర్హత కలిగిన ప్రతి నిరుపేదలందరికీ ఇంటి స్థలం ఇస్తూ ఇంటి నిర్మాణం కోసం సమానంగా నిధులు మంజూరు చేయడం జరిగింది. జగన్న కాలనీలో మౌలిక వసతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, ఇంటి సర్వీస్ కోసం కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం తాజా నిర్మాణానికి మాత్రమే రూ.4లక్షలు ఇస్తామని చెప్పడం సరికాదని, గత ప్రభుత్వంలో వివిధ దశలో ఆగిపోయిన ఇంటి కూడా రూ.4లక్షల స్కీమ్ వర్తింపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.4 లక్షలు ఇవ్వండి..

జగనన్న పథకంలో ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం 9 అడుగుల వరకు నిర్మాణ పనులు జరిగింది. ఎన్నికల రావటంలో పనులు ఆగిపోయింది. ప్రస్తుతం సిమెంట్, కమ్మీల రేట్లు పెరిగిపోయింది. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో చెప్పినట్లు రూ.4లక్షలు మంజూరు చేయాలి. కొత్తగా కట్టుకొనే వారికి మాత్రమే వర్తింపు చేయడం సరైనది కాదు. ఇలా చేయడం పక్షపాత ధోరణి అవుతుంది.

అందరికీ సమానంగా ఇవ్వాలి

గత ప్రభుత్వం సుమారు రూ.4లక్షల విలువ కలిగిన ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టుకొనుటకు రూ.2లక్షలు ఇచ్చింది. మొత్తం రూ. 6లక్షల రూపాయలు అందించింది. పార్టీలకు అతీతంగా, కుల, మత బేధాలు లేకుండ అర్హత కలిగిన వారిరందరికీ ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం నూతనంగా కట్టుకొనే వారికి మాత్రమే రూ.4లక్షలు మంజూరు చేయడం సబబు కాదు. గత ప్రభుత్వంలో మంజూరై వివిధ దశలో ఆగిపోయిన వారికి కూడా రూ. 4లక్షలు మంజూరు చేసి న్యాయం చేయాలి

చేతి బోరు బాగుచేయండి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని మరమ్మతుకుగురైన చేతిబోరు బాగు చేయాలని గ్రామప్రజలు కోరుతున్నారు. విద్యుత్ మోటార్ మరమ్మతుకు గురైనప్పుడు స్థానిక ప్రజలకు తాగునీటికి ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. చేతి బోరు పంపు ఉంటే తాగునీటి సమస్య రాకుండా తాత్కాలిక నీటి సమస్య ఉండదని అంటున్నారు. మండలంలోని 32 పంచాయతీలలో చేతి బోర్లు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని గుర్తించి బాగుస్తే నీటి సమస్యకు ఓ పరిష్కారం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

వానలోనూ పనులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ చిన్నమ్మరెడ్డి కండ్రిగ వద్ద 11 కెవి విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మలకు తగులుతున్నాయని, వర్షాల నేపథ్యంలో షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదముందని స్థానికులు గురువారం విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో మాంబేడు సచివాలయ విద్యుత్ శాఖ లైన్‌మెన్ పాపిరెడ్డి తన సిబ్బందితో వర్షంలోనూ విద్యుత్‌లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను వెంటనే కత్తిరించారు. అనంతరం విద్యుత్ అంతరాయం లేకుండా పునరుద్దించారు. రెండురోజుల క్రితం ప్రజాశక్తి దినపత్రికలో అల్లుకున్న నిర్లక్ష్యం అనే శీర్షికన కథనాలు రావడంతో విద్యుత్ శాఖ సిబ్బంది సమస్య అని చెప్పిన వెంటనే పనిచేశారంటూ స్థానికులు చెబుతున్నారు.

పేయి దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: అధిక పాలు దిగుబడి ఇచ్చే సంకరజాతి జెర్సీ ఆవులు నుంచి మంచి దూడలను అందించడం వల్ల రైతులకు పాల దిగుబడి పెంచవచ్చని పిటిపి ప్రాజెక్ట్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య తెలిపారు. మండలంలోని ఎగువకొట్టి వానత్తం గ్రామంలో పేయి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పిటిపి ప్రాజెక్ట్ రీజినల్ కోఆర్డినేటర్ ఆదిత్య మాట్లాడుతూ జెర్సీ, సాహివాల్ ఈ రెండింటి కలయిక వల్ల సంకరజాతి జెర్సీ ఆవులు ఉత్పత్తి చేస్తున్నారని, 2019 నుంచి దాదాపు 300 మేలు జాతి కోడెదూడలను ప్రభుత్వానికి అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విర్బాక్ కంపెనీ ద్వారా ఆవులకు ఉపయోగపడే లీవర్ టానిక్, మినరల్ మిక్సర్, ఎదకు రావడానికి ఉపయోగపడే మందులు అందించారు. అనంతరం పాడిరైతులు సుబ్బారెడ్డి, కృష్ణమ్మ, పుష్పకు బహుమతులను బహుమతులను అందించారు. ఈ డిడి గోవిందయ్య, ఏపీఎల్ డీఏడీ బాలసుబ్రమణ్యం, వెదురుకుప్పం ఏవో రూప సుందరి, వీఏఎస్ డాక్టర్ శ్రీవిద్య, పశు సంవర్ధక సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గ పరిధిలో నిర్విరామంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం పట్టణ పరిధిలోని 13వ వార్డు బూత్ కన్వీనర్ ఎన్‌కె.మణి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ హాజరయ్యారు. వార్డు పరిధిలో ప్రతి ఇంటికి వెళుతూ టిడిపి సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ, వారి అంగీకారంతో ఆన్లైన్ ద్వారా సభ్యత్వ నమోదు చేయించారు. టిడిపి నాయకులు 13వ వార్డు పార్టీ అధ్యక్షులు లోకేష్, ప్రధాన కార్యదర్శి భరత్ తదితరులు పాల్గొన్నారు.

చింతపండు వ్యాపారస్తులకు రూములు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు పట్టణంలో చింతపండు వ్యాపారస్తులకు స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రూములు కేటాయించాలని టిడిపి నేతను కోరారు. ఏఎంసీ ఆవరణలో గురువారం చింతపండు వ్యాపారస్తులు, టిడిపి నేత సయ్యద్ సుహేల్ బాష ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతపండు వ్యాపారస్తులు, సంఘ సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చింతపండు వ్యాపారస్తులందరినీ చులకనగా చూసిందని, ఆ పార్టీలో పలుకుబడి ఉన్న వారికి మాత్రమే పనులు చేసుకోవడం జరిగిందన్నారు. చిన్న సన్న వ్యాపారస్తుల గురించి పట్టించుకున్న పాపానపోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ నాయకులు మా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చల్లా బాబు మాట్లాడుతూ మీ సమస్యలన్నీ గుర్తించి మా ప్రభుత్వం తరఫున పరిష్కరిస్తామనిహామీ ఇచ్చారు. కార్యక్రమంలో చింతపండు వ్యాపారస్తులు ఎస్‌జెఎస్ చాంద్ బాషా, ఎస్‌పిబి అఫ్సర్ బాషా, ఎంకెబి ఇంతు, ఎంటిసి బాబా, హాఫీజ్ అఫ్జల్, షరీఫ్, మొదలియార్ పాల్గొన్నారు.

మానవ హక్కుల జిల్లా ఉపాధ్యక్షురాలుగా విజయలక్ష్మి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షురాలుగా విజయలక్ష్మిని ఎన్నిక చేసినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి డి.వి.మునిరత్నం, శ్రీనివాసులు తెలిపారు. గురువారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయంలో భూదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలుగా విజయలక్ష్మిని ఎన్నికచేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గ నాయకులు మణి, పార్థసారథి, గుర్రం సుబ్రహ్మణ్యం, మాట్లాడుతూ ప్రజాసమస్యలపై మానవహక్కుల సంస్థ నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తున్నదువలన కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన విజయలక్ష్మి ఆకర్షితురాలై తమతో కలిసి పనిచేయడానికి సంసిద్ధమయ్యారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన విజయలక్ష్మికి వ్యక్తిగత గుర్తింపు కార్డును నాయకులు చేతుల మీదుగా అందచేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో మానవ హక్కుల సంస్థ జిల్లా ఉపాధ్యక్షురాలుగా బాధ్యతను ఇచ్చారని ఆ నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నిస్వార్థంతో, పారదర్శకంగా, బంధుప్రీతి లేకుండా మానవ హక్కుల నాయకులతో కలిసి ప్రజల కోసం పోరాడతానని తెలిపారు. తనకు 30 సంవత్సరాలు ప్రజాసేవలో అనుభవం ఉందని, అదే తరహాలో మానవ హక్కుల సంస్థ నిబంధనల మేరకు జిల్లా ప్రజలకు మరికొన్ని సేవలు అందిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈఅవకాశం కల్పించిన జిల్లా, నియోజకవర్గ, మండలాల మానవ హక్కుల నాయకులకు ఆమె ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. సరస్వతి, ధనమ్మ, నాగార్జున, సాంబశివ, ఆనంద, గంగన్న, గోపాల్ గౌడ్ సుబ్రహ్మణ్యం గురు రాజా, ఓబుల్ రెడ్డి, దాము, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పీఈఎస్ వైద్య కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ దొరస్వామి నాయుడు జన్మదిన వేడుకలను కళాశాల, ఆసుపత్రి సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కళాశాలలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన జన్మదిన వేడుకలలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, పాలు, బెడ్లు పంచిపెట్టారు. ఆసుపత్రి సిబ్బంది రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే స్థానిక విక్టరీ బోర్డింగ్ పాఠశాల నందు విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

హద్దులు దాటిన వైసిపి సోషల్ మీడియాకు

తగిన శాస్తి చేస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో వైసిపి సోషల్ మీడియా హద్దులు దాటి ప్రవర్తిస్తోందని, ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత, మంత్రి నారా లోకేష్, వారి కుటుంబ సభ్యుల పట్ల వైసిపి అనుకూల సోషల్ మీడియా అల్లరి మూకలు విశృతంగా పోస్టులు పెట్టడాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులే లక్ష్యంగా.. సభ్యసమాజం తలదించుకునేలా పోస్టులు పెడుతూ వైసిపి నీచ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు.వీటన్నిటికీ త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసిపిని చీదరించుకున్నా ఆ పార్టీ వారికి బుద్ధి రాలేదన్నారు. సోషల్ మీడియా సైకోలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని అన్నారు. పోలీసు శాఖను ప్రక్షాళన చేసి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి మరింత పటిష్ట చర్యలు తీసుకుంటారని, వైసిపి అల్లరి మూకలకు తగిన శాస్తి చేస్తామన్నారు. పోలీసు అధికారులు సోషల్ మీడియా వేదికగా అవాస్తవాలు, అసత్యాలను ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.